




కుప్పం నియోజకవర్గంలో సందడి చేసిన నారా భువనేశ్వరి

'స్మార్ట్ ఐకానిక్'కు నిధుల లేమి..!



రెండేళ్లుగా ఒక అంతస్తే నిర్మాణం మిగిలిన నాలుగు అంతస్తులు ఎప్పటికో.. అభివృద్ధి పనుల్లో 'బినామీ'లదే హవా..

స్మార్ట్ ఐకానిక్ భవన నిర్మాణ పనులు నిధుల్లేక నిరసించిపోతున్నాయి. రెండేళ్లుగా ఒక అంతస్తు నిర్మాణం కూడా పూర్తవ్వకపోడం గమనార్హం. 2024, జనవరి కల్లా ఈ భవనం పూర్తవ్వాల్సి ఉంది. అయితే ఈ భవనం నిర్మాణానికి రూ.81 కోట్లతో టెండర్ పిలిస్తే, 71 కోట్లకే నిర్మిస్తామని బిల్డర్ ముందుకొచ్చారు. అయితే ఇప్పటివరకూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం 8 కోట్లు మాత్రమే నిధులు కేటాయించడం గమనార్హం. రెండేళ్లలో ఒక్క అంతస్తే పూర్తి కాకపోతే, మిగిలిన నాలుగు అంతస్తులు ఎప్పటికి పూర్తయ్యేనో మరి. మరోవైపు తిరుపతి కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ ఉన్నతాధికారులే బినామీ పేర్లతో పనులు దక్కించుకుంటున్నారన్న విమర్శలను మూటగట్టుకుంటున్నారు. అభివృద్ధి పనులన్నీ ఒకరిద్దరే దక్కించుకుంటూ రాజకీయ పలుకుబడితో బిల్లులు చేసుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం. చిన్న, మధ్యతరగతి కాంట్రాక్టర్లకు బిల్లులు వచ్చి ఏడాదిపైనే అయ్యింది. పాలకులకు 'భజన' చేసిన వారే బినామీలుగా చలామణి అవుతున్నారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

2022, ఆగస్టులో తిలక్‌రోడ్డులో ఉన్న పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానంలో ఐకానిక్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా రూ.81 కోట్లతో టెండర్లు పిలిచారు. చెన్నయ్‌కి చెందిన ఆర్ ఆర్ తులసీ బిల్డర్స్ కంపెనీ రూ.71 కోట్లకే ఐదు అంతస్తుల స్మార్ట్ ఐకాన్ భవనం నిర్మిస్తామని పనులు చేపట్టింది. అందులోనే కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్మార్ట్‌సిటీకి నిధులు కేటాయింపులు లేవు. కేంద్ర బడ్జెట్‌లో కొంతమేర కేటాయించారు. మూడేళ్లుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్మార్ట్‌సిటీ నిధులు రావడం లేదు. ఐకాన్ భవనం 19 నెలల్లో పూర్తి చేయాలని కంపెనీకి షరతు విధించారు. అయితే నిధుల కేటాయింపులు లేకుండా పనులు ఎలా పూర్తవుతాయన్నది బిల్డర్లు చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికే స్మార్ట్‌సిటీ పథకంలో చేసిన బిల్లులు రాక కాంట్రాక్టర్లు చాలా వరకూ పనులను నిలిపేశారు. దాదాపు 25-30 కోట్ల పైనే బిల్లులు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉంది. తిరుపతి కార్పొరేషన్ ఖజానా అంతంత మాత్రమే. కౌన్సిల్ వచ్చిన తరువాత బడ్జెట్‌తో సంబంధం లేకుండా అభివృద్ధి పనులకు జనరల్ ఫండ్స్‌లో పనులు చేపట్టారు. ఇందుకు సంబంధించిన బిల్లులు కూడా రూ.20 కోట్లు రావాల్సి ఉందని సమాచారం. దీనికితోడు మాస్టర్‌ప్లాన్ రోడ్లు 12 చేపట్టారు. వీటికి దాదాపు 30 కోట్లు ఖర్చవుతుంది. కార్పొరేషన్ కార్యాలయాన్ని పాత మెటర్నిటీ ఆస్పత్రిలోకి మార్పు చేసి కోటికి పైగా నిధులు ఖర్చు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాని పరిస్థితి. కేవలం ఆస్తిపన్నులు, ప్రకటనలు, భవన నిర్మాణ అనుమతులు ఫీజుల ద్వారానే కార్పొరేషన్ నెట్టుకొస్తోంది.

కమాండ్‌కంట్రోల్‌తో నేరాలకు చెక్ ఎప్పుడు..?

స్మార్టుసిటి పథకంలో నగరంలో నేరాలను అదుపుచేయడానికి స్మార్టుసిటిఐకాన్ భవనంలో 5వ అంతస్తులో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేయనున్నారు. సుమారు నగరంలో 450 సిసికెమెరాలు ఏర్పాటు చేసి అక్కడ నుంచి నేరాలను పరిశీలించి పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకునే విదంగా కమాండ్ కంట్రోల్ ప్లాన్‌లో రూపొందించారు. సిసికెమెరాల ఏర్పాటు కూడా భవన నిర్మాణం పూర్తియితే తప్ప . వాటిని ఏర్పాటు చేయలేరు. కమాండ్ కంట్రోల్‌తో నేరాలతో పాటు నగరంలలో ఎక్కడెక్కడ చెత్త తొలగించలేదు, ఎక్కడెక్కడ నీటి లీకేజీలు ఉన్నాయి అన్నీ పరిశీలించవచ్చు.

రాజకీయ పలుకుబడి ఉన్నవారికే బిల్లులు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో రాజకీయ పలుకుబడి ఉన్నవారికే బిల్లులు వస్తున్నాయన్న విమర్శలున్నాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ గతంలో కమిషనర్లుగా పనిచేసిన వారు బడా కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఇచ్చేశారని తెలుస్తోంది. చిన్న చిన్న కాంట్రాక్టర్‌లకు బిల్లులు వచ్చి ఏడాదిపైనే అవుతుంది. బడా కాంట్రాక్టర్లు ప్రతి రెండు నెలలకు ఓసారి కోట్లలో బిల్లులు బినామీల పేర్లతో తీసుకుంటున్నారని సమాచారం. అభివృద్ధి పనులు చాలావరకు బినామి కాంట్రాక్టర్ పేర్లపై ఉంటుంది. బిల్లులు కోసం కమీషనర్ దృష్టికి తీసుకువచ్చిన రాజకీయ పలుకుబడి ఉన్న వారికి మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారు. గతంలో ముందుగా పనులు చేసిన వారికి సీనియరిటి ప్రకారం బిల్లులు ఇచ్చేవారు. ఇపుడు అ పద్ధతి పాటించడం లేదు. దీంతో చాలమంది కాంట్రాక్టర్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికార్లు పిలిచే పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. బడా కాంట్రాక్టులు పనులు తీసుకుని ఇతరుల పేర్లతో పనులు చేసి బిల్లులు పొందుతున్నారు. దీనివల్ల నగరంలో అభివృద్ధి కుంటుపడుతుంది. పనులు కూడా ఒకరిద్దరు బడా కాంట్రాక్టర్లు చేస్తున్నారు. వీరు చేసే పనులు కూడా నాశిరకంగా ఉంటున్నాయని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో కొందరు బినామీ కాంట్రాక్టర్ల అవతారమెత్తారని తెలుస్తోంది. ఇటు అధికారిగా అటు బినామి కాంట్రాక్టర్ అవతారం ఎత్తి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

బాబు, నేను పోటీ చేస్తే 'మీ ఓటు ఎటు'?

కుప్పంలో నారా భువనేశ్వరి సరదా వ్యాఖ్యలు
మహిళలపై అత్యాచారాల్లో ఎపి నంబర్ 1
ఎన్నికల్లో ధీటుగా పోరాడాలని శ్రేణులకు పిలుపు

ప్రజాశక్తి - శాంతిపురం, రామకుప్పం, పుంగనూరు (చిత్తూరు జిల్లా)

'నిజం గెలవాలి' నారా భువనేశ్వరి కార్యక్రమం రెండో రోజు కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో సాగింది. శాంతిపురంలో నిజం గెలవాలి కార్యక్రమంలో బుధవారం పాల్గొన్న నారా భువనేశ్వరి సభికులతో సరదాగా గడిపారు. 'చంద్రబాబును 35 ఏళ్లు గెలిపించారు.. ఈసారి నేను పోటీచేస్తే నన్ను గెలిపిస్తారా..?' అంటూ చమత్కరించారు. సభికులు ఇద్దరినీ గెలిపిస్తాం అంటే అలాకాదు ఎవరో ఒకరినే చెప్పాలంటూ సరదాగా సభికులతో మాట్లాడారు. సరదాగా అంటున్నా, నేను చాలా హ్యాపీగా ఉన్నా, రాజకీయాలకు తాను దూరం అంటూ చివర్లో వ్యాఖ్యానించారు. ఎపుడూ సీరియస్ చర్చలే కాదు, అపుడపుడు సరదాగా మాట్లాడుకోవాలన్న ఉద్దేశ్యంతోనే ఈ చర్చ చేసినట్లు చెప్పారు.

మహిళలపై అత్యాచారాల్లో ఎపి నంబర్ 1

మహిళలపై అత్యాచారాల్లో ఎపిని నంబర్ 1గా నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శాంతిపురంలో 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' అంశంపై ముఖాముఖి కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు స్త్రీ అబలగా ఉండేవారని, స్త్రీలకు గౌరవం, ధైర్యం, హక్కులు ఇచ్చి సమాజంలోకి తీసుకొచ్చిన వ్యక్తి అన్న ఎన్టీఆర్ అని అన్నారు. 1986లో ఎన్టీఆర్ స్త్రీలకు ఆస్తిలో సమానహక్కును కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. మహిళలకు ప్రత్యేకంగా తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీని తీసుకొచ్చారన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ అమలు చేశారన్నారు. రాజకీయాల్లో రిజర్వేషన్, డ్వాక్రా సంఘాలను చంద్రబాబు ముందుచూపుతో తీసుకొచ్చారన్నారు. ప్రొద్దుటూరులో ఆరేళ్ల బాలికపై అరవై ఏళ్ల వృద్ధుడు అత్యాచారానికి పాల్పడితే ఆ నిందితుని కఠినంగా శిక్షించాలని చంద్రబాబు ఆర్డర్ వేస్తే, ఆ నిందితుడు ప్రాణభయంతో ఆత్మహత్య చేసుకుని చనిపోయాడన్నారు. దిశ చట్టం కాగితాలకే పరిమితమయ్యిందన్నారు. ఏపీని గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చారన్నారు.

అన్నాక్యాంటిన్ ప్రారంభం

శాంతిపురం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద, రామకుప్పం పోలీసు స్టేషన్ పక్కన అన్నా క్యాంటిన్‌ను ప్రారంభించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పులివర్తి నాని, డాక్టర్ సురేష్, కుప్పం పార్టీ ఇన్చార్జి పిఎస్ మునిరత్నం, చంద్రబాబు పిఏ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు పాల్గొన్నారు.

పలు కుటుంబాల పరామర్శ

పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం కతర్లపల్లి గ్రామంలో, పుంగనూరు నియోజకవర్గం ఎన్ఎస్‌పేటలో, మంగళం, ఒంటిమిట్ట గ్రామాల్లో కార్యకర్త కుటుంబాలను పరామర్శించారు. రాత్రికి మదనపల్లి టికెఎన్ గ్రాండ్ సిటీలో బస చేయనున్నారు. పలమనేరు నియోజకవర్గ పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో టిడిపి కార్యకర్తలు సై అంటే సై అని ధీటుగా పోరాడాలన్నారు.



'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారులకు ప్రశంసలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆడుదాం ఆంధ్ర 2023 ఫైనల్ పోటీలలో గెలుపొందిన తిరుపతి జిల్లా క్రీడాకారులను కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ ప్రశంసించారు. ఈ నెల 9 నుండి 15 వరకు విశాఖపట్నం నందు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడదాం ఆంధ్ర ఫైనల్ పోటీలలో కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగం ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమని అన్నారు. విజేతలకు ట్రోఫీ, సిల్వర్ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎ.సుమన్, సతీష్‌లకు మూడు లక్షలు, కబడ్డీ క్రీడాకారులకు 25వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేసినట్లు క్రీడాభివృద్ధి అధికారి సయ్యదర్ సాహెబ్ తెలిపారు. డిఇఒ శేఖర్ పాల్గొన్నారు.

అధ్యయనంతోనే సమాజ మార్పు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

సమాజ మార్పుకు పాటుపడే సిపిఎం శ్రేణులు లెనిన్ రచించిన రాజ్యం, విప్లవం పుస్తకాన్ని అధ్యయనం తప్పనిసరిగా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా 'రెడ్ బుక్ డే' అధ్యయన కార్యక్రమం బుధవారం జరిగింది. తిరుపతి యశోదానగర్‌లో వి.నాగరాజు మాట్లాడుతూ గత సమాజాల చరిత్రలో వర్గ దోపిడీని వివరించారు. దోపిడీ వర్గాలకు రాజ్యాంగ యంత్రాంగం ఏ విధంగా ఉపయోగపడిందో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, నేతలు టి సుబ్రమణ్యం, ఎస్ జయచంద్ర, ఎం మాధవ్, జి బాలసుబ్రమణ్యం, పి సాయి లక్ష్మి, ఎం జయంతి,

జిల్లావ్యాప్తంగా 'రెడ్ బుక్ డే'



లెనిన్ రచనలను అధ్యయనం చేస్తున్న సిపిఎం శ్రేణులు

ముని రాజా, అక్బర్ , రవి తదితరులు పాల్గొన్నారు.

మార్పును కర్తవ్యంగా భావించాలి


శ్రీకాళహస్తి పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్‌ఎం షరీఫ్ మాట్లాడుతూ మార్పును కర్తవ్యంగా భావించి సిపిఎం శ్రేణులు పోరాటాలు చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, నాయకులు మరినాథ్, ఒ.వెంకటరమణ, గంథం మణి పాల్గొన్నారు.

గూడూరులో.. సిపిఎం కార్యాలయంలో బివి రమణయ్య అధ్యక్షతన జరిగింది. పట్టణ కార్యదర్శి ఎస్.సురేష్, సీనియర్ నాయకులు టి.వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ యావత్ ప్రపంచ మానవాళిని విముక్తిబాట పట్టించే మార్పు విప్లవమని వివరించారు. 1848, ఫిబ్రవరి 21న లండన్‌లో ఈ పుస్తకాన్ని ముద్రించి ప్రజల చేతుల్లో పెట్టారని, అందుకే ఈరోజును రెడ్‌బుక్ డే జరుపుకుంటున్నామన్నారు. జోగి శివకుమార్, సుధీర్, వాసుదేవరావు పాల్గొన్నారు.

దేవప్రసాద రాజుకు 'సేతు గుణశేఖరన్' పురస్కారం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగ ప్రొఫెసర్ బి. దేవ ప్రసాదరాజు ప్రతిష్టాత్మక శాస్త్రవేత్త మధుమునైవార్ సేతు గుణశేఖరన్ పురస్కారానికి ఎంపికయ్యారు. భౌతిక శాస్త్రానికి సంబంధించిన బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజు చేసిన కషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రకటించారు. తమిళనాడు రాష్ట్రం కష్ణగిరి జిల్లా కట్టేరిలో గల శ్రీ విద్యా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛం, ధ్రువీకరణ పత్రం అందజేసి ప్రొఫెసర్ దేవప్రసాద రాజును ఘనంగా సత్కరించారు. ఎస్వీయూలో పిహెచ్‌డీ పూర్తి చేసిన దేవప్రసాదరాజు, 2007లో ఫిజిక్స్ విభాగంలో అధ్యాపకులుగా చేరారు. ఈ క్రమంలో ఫిజిక్స్ విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) మెంబర్ గా పని చేశారు. ఫిజిక్స్ కు సంబంధించిన మెటీరియల్ సైన్స్, ఫొటానిక్స్ ప్రత్యేక అంశంగా బోధన , పరిశోధన రంగాల్లో 25 ఏళ్ళుగా కషి చేస్తూ



ఉన్నారు. వీరు రూపొందించిన 100 కు పైగా పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. వీరి పర్యవేక్షణలో 12 మంది పీహెచ్.డీ డిగ్రీలు పొందారు. హాస్టల్ వార్డెన్ గా, అడ్మిషన్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ గా, యూనివర్సిటీ శాస్త్ర ఉపకరణ కేంద్రం డైరెక్టర్ గా సేవలందించారు. ప్రస్తుతం ఏపీ రీసెట్-2024 కన్వీనర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ శాస్త్రవేత్త సేతు గుణశేఖరన్ పురస్కారం స్వీకరించడం పట్ల పలువురు ప్రొఫెసర్ దేవప్రసాద రాజును అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు పొందాలని వారు ఆకాంక్షించారు.



మండుటెండలో నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - క్యాంపస్

ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద సేవ కార్మికులు కనీస వేతనం పెంచాలంటూ మండుటెండలో మలమల మాడుతూ నడిరోడ్డపైనే అన్నం తింటూ నిరవధిక సమ్మెను కొనసాగించారు. సిఐటియు నాయకులు ఎస్.జయచంద్ర, రాష్ట్ర కోశాధికారి నాగ వెంకటేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. అగ్రికల్చర్ పరిధిలో వివిధ రీసెర్చి స్టేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్‌ను ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలన్నారు. ఏడాదంతా పనిచూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వరలక్ష్మి, రాకేష్, చంద్రమ్మ, సుబ్బు, ముని, లక్ష్మి, రాధా, రేవతి పాల్గొన్నారు.

కూలిన వంతెనలకు వార్షికోత్సవాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండల పరిధిలో చిగురవాడ వద్ద స్వర్ణముఖినది వంతెన వద్ద ఓబీసి పోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ ఆధ్వర్యంలో విన్నూత్న పద్ధతిలో కూలిన వంతెనకు మూడవ వార్షికోత్సవం నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు తాయిలాలు ఇవ్వకుండా అభివద్ధి చేపడితే చాలు అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించాడు. డప్పులు వాయిస్తూ, బాణా సంచి కాల్చుతూ, నియోజకవర్గ ప్రజలకు తాయిలాలు వద్దు అభివద్ధే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ, కొట్టుకుపోయిన వంతెన వద్దకు వచ్చి పూలమాల వేసి, కేక్ కట్ చేసి నిరసన తెలిపారు.



మామిడికి తేలికపాటి నీటి తడులు అవసరం

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు

ప్రస్తుతం మామిడి తోటలు పిందె దశలో వున్నాయని, ఈ సమయంలో తేలిక పాటి తడులు అందిస్తే నాణ్యమైన దిగుబడిని పొందవచ్చుని మండల ఉద్యానశాఖాధికారి శివకుమారి రైతులకు సూచించారు. బుధవారం చిన్నగొట్టిగల్ను పరిధిలోని మామిడి తోటలను పరిశీలించారు. మామిడిలో ప్రస్తుతం అక్కడక్కడ పిందెలు ఏర్పడి ఉన్నాయి. తప్పనిసరిగా తేలికపాటి నీటి తడులు ఇస్తే కాయ



పరిమాణం, నాణ్యత పెరుగుతుందని తెలిపారు. అక్కడక్కడ ఇగురు గాని, పూత గాని రాని తోటల్లోనూ నీటి తడులు తేలికపాటిగా ఇచ్చినప్పుడు ఏదో ఒక రూపంలో పూతగాని ఇగురు గాని వచ్చే అవకాశం ఉందన్నారు. ఎండల వల్ల పిందెలు పసుపు రంగులోకి మారి రాలిపోవడం జరుగుతుందని, దీని నివారణకు సున్నం 5 గ్రాముల నుండి 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే నివారించ వచ్చని తెలిపారు.

3న పల్స్‌పోలియోను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని 0 - 5 సంవత్సరాల లోపు పిల్లలు అందరికి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం హాల్ నందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, డి ఈ ఓ. శేఖర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి జయలక్ష్మి, డి ఐ ఓ శ్రీనివాసులు లతో కలసి మార్చి 3 న (ఆదివారం) నిర్వహించే జాతీయ పోలియో కార్యక్రమానికి సంబందించి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ తో నిర్వహించిన సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో 0 - 5 సంవత్సరాల లోపు 2,53,282 మంది పిల్లలకు 3,36,860 డో సులు రావడం జరిగిందని. జిల్లాలో మొత్తం1824 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గోడపత్రికను ఆవిష్కరించారు.


భూచట్టం...లోపాల చట్రం..!

యాజమాన్య హక్కును హరిస్తుంది
పెత్తనమంతా పాలకులు, అధికారులదే
నూతన చట్టంపై న్యాయనిపుణుల ధ్వజం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల చట్టం (ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్- 27/2023ను 2023 అక్టోబరు 31 నుంచి అమల్లోకి వచ్చినట్లు జీవో నెంబరు 512ను జారీ చేసింది. ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదించడంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ చట్టం ముఖ్య ఉద్దేశం ప్రజల భూమి, ఇతర స్థిరాస్తి హక్కులు న్యాయవ్యవస్థ పరిధి నుంచి తొలగించి అధికార పార్టీ, రాజకీయ దళారీ, కబ్జాదారులకు అప్పగించడమే.ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సర్వే 2019 లెక్కల ప్రకారం ఆస్తి రిజిస్ట్రేషన్ విషయంలో ఇండియా 154 స్థానంలో ఉన్నదని, 66 శాతం సివిల్ కేసులు భూమికి సంబంధించిన ఎక్కువ కేసులు కోర్టుల్లో ఉన్నాయని, వీటి సత్వర పరిష్కారం కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం ఈ చట్టాన్ని తెచ్చామని ప్రభుత్వం చెబుతోంది. చట్టాలను అమలు చేసే విషయంలో ఇండియా 163వ స్థానంలో ఉందని, సివిల్ కోర్టుల అధికారాలు తీసివేస్తే త్వరగా వ్యాపారం జరగుతుందనే ఉద్దేశంతో నీతి ఆయోగ్య వారు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన దేశ వ్యాప్త ప్రతిపాదన ఇది. సివిల్ కేసులు సత్వర పరిష్కారం కావాలంటే న్యాయ వ్యవస్థను పటిష్టం చేయాలి. అలాకాకుండా చట్ట పరిధినే తప్పించేలా చట్టం ఉందన్న న్యాయనిపుణుల మాటల్లోనే..

ఈ యాక్టు చాలా దుర్భరమైనది : సంపత్‌కుమార్, అడ్వకేట్, తిరుపతి



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ల్యాండ్ యాక్టు చాలా దుర్భరమైనది. కోర్టులకు ఏ ప్రమేయం లేకుండా రూపొందించింది. ల్యాండ్ టేకింగ్ ఆఫీసర్లను నియమించి, వారి ద్వారా భూ హక్కును నిర్ణయించే విధంగా కేంద్రం సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. రాష్ట్ర పరిధిలో ల్యాండ్ సేఫ్టీ ఆఫీసర్‌గా రెవిన్యూ వ్యవస్థలో ఉండే సీనియర్లకు ప్రమోషన్ ఇచ్చి, ప్రజాప్రతినిధుల సిఫార్సుతో నియమిస్తారు.కొత్త చట్టం ద్వారా కోర్టుల ప్రమేయమే లేకుండా చేయడం దారుణం.

ఇది చీకటి చట్టం : జె.దేవరాజులు, న్యాయవాది, తిరుపతి



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ చట్టం చీకటి చట్టం. దీన్ని రద్దు చేయాలని కోరుతూ మూడు నెలలుగా న్యాయవాదులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదు. ఈ యాక్టు ద్వారా భూ యజమానులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, అందరిలో చైతన్యం తీసుకొచ్చి పోరాటాన్ని తీవ్రతరం చేస్తాం.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఏపి టైటిలింగ్ యాక్టు -2023 లోప భూయిష్టంగా రూపొందింది. తమ సొంత భూములపై యజమానులకే హక్కు లేకుండా చేసి, రెవిన్యూ అధికారుల నిర్ణయాన్ని శిరోధార్యం చేస్తోంది. పాలకపక్షం సిపార్సులకు, పెత్తం దారులు, భూస్వాముల ఆదేశాలకు అనుగుణంగా యాజమాన్యాన్ని నిర్ణయించే దుర్మార్గమైన చీకటి చట్టం కొత్త భూచట్టం అంటూ న్యాయ నిపుణులే వాపోతున్నారు. ఏకంగా దీనిపై న్యాయవాదులే విధులు బహిష్కరించి, నిరసన బాట పట్టడం గమనార్హం.


నల్ల చట్టాన్ని రద్దు చేయాలి : ఎ.రాజశేఖర్, లాయర్, తిరుపతి

ఈ చట్టం ప్రజల హక్కులను కాలరాసేలా ఉంది. ఈ నల్లచట్టాన్ని వెంటనే రద్దు చేయాలి. నెలల తరబడి న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా వినూత్న రీతిలో నిరసనలు తెలియజేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. ఈ ఎలాంటి చట్టం న్యాయవాదుల కోసం కాదు. చిన్నకారు రైతు, సామాన్యుల కోసం. రెవిన్యూ అధికారులకు అనువుగా ఏకపక్ష నిర్ణయం తీసుకునేలా ఉంది. ఈ చట్టం ద్వారా లాభం కంటే నష్టమే ఎక్కువ. అందుకే ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి.




సామాన్యులకు నష్టం కల్గించే చట్టం : ఎస్.కల్యాణ్, వకీలు, తిరుపతి

రాష్ట్ర ప్రభుత్వం భూ యజమానులకు హక్కును నిర్దేశించే పూర్తి అధికారాన్ని రెవిన్యూ అధికారులకు కట్టబెట్టుతూ తీసుకొచ్చిన కొత్త భూ హక్కు చట్టం సామాన్యులకు నష్టం కల్గించేలా ఉంది. ఈ చట్టం ద్వారా రెవిన్యూ అధికారుల చేతుల్లోకి భూ హక్కును కల్పించే మొత్తం పవర్ వెళ్లాలా ఉంది. దీన్ని వెంటనే రద్దు చేయాలి.



భూస్వాములకు, పెత్తందారులకు కొమ్ముకాసేలా ఉంది : మురగేషన్ ప్రభు, న్యాయవాది, తిరుపతి

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ హక్కు చట్టం భూస్వాములకు, పెత్తందారులకు కొమ్ముకాసేలా ఉంది. ఎవ్వరికైనా భూ సమస్య ఏదైనా వస్తే న్యాయస్థానాలను ఆశ్రయిస్తారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టంలో ఏదైనా భూ వ్యవహారంలో లోపాలు జరిగితే ప్రశ్నించే హక్కు లేదు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులు, దళితుల భూములను లాక్కొనే కుట్ర చేసింది. భూములను రీ సర్వే చేయించింది. దీన్నిపై ఎవ్వరూ సివిల్ కోర్టుకు వెళ్లకూడదనేలా యాక్టు తెచ్చారు. ఇది రాజ్యాంగ హక్కును హరించేలా ఉంది.



నత్తనడకన రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దశాబ్దాల కల మంగళం-శెట్టిపల్లి మార్గం నెరవేరబోతోందని ఆశపడ్డ స్థానిక ప్రజలకు నిరాశ మిగులుతోందా?. రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వే గేటు వరకు 80అడుగుల రోడ్డు నిర్మాణం చేయాలని టిటిడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి నేతృత్వంలోని బోర్డు తీర్మానం చేసి రూ.15.12 కోట్లు నిధులు కూడా కేటాయించారు. గత ఏడాది డిసెంబర్ 7వ తేదీన మొదలుపెట్టిన పనులు నత్తనడకన సాగుతూ ఉండడంతో స్థానిక ప్రజలు రోడ్డు నిర్మాణం జరుగుతుందన్న ఆశలపై తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు నీళ్లు జల్లుతున్నారా?. అనే ప్రశ్నలు సంధిస్తున్నారు. మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి మార్గాన్ని కలుపుతూ నిర్మించ తలపెట్టిన 80అడుగుల రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ సంసిద్ధంగా ఉన్నా, ఈ మార్గంలో తిరుచానూరు, దామినేడు, రేణిగుంటకు తాగునీటి సరఫరాకు తెలుగుగంగ పైపులు ఉండి వాటి ద్వారా ఏర్పడిన లీకేజీలతో రోడ్డు ఛానల్ పనులు మందకొడిగా సాగడానికి కారణం అవుతున్నాయి. లీకేజీలు అరికడితే పనులలో వేగం పెరిగే అవకాశం ఉన్న తెలుగు గంగ ప్రాజెక్టు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోడ్డు నిర్మాణ పనులలో జాప్యం జరుగుతోందని విమర్శలు ఉన్నాయి. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అధికారులందరూ సమన్వయంతో మంగళం-శెట్టిపల్లి మార్గం త్వరతగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినా క్షేత్రస్థాయిలో ఆ ఆదేశాలు అమలు కావడం లేదు. మంగళం నుండి శెట్టిపల్లి మార్గంలో అక్కడక్కడ ఎక్కువ సంఖ్యలో లీకేజీలు ఉండడంతో రోడ్డు ఛానల్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇకనైనా తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు వీలైనంత త్వరగా లీకేజీలను అరికట్టితేనే మంగళం-శెట్టిపల్లి మార్గంలో 80అడుగుల రోడ్డు నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. అధికారులు ఆ విధంగా సమన్వయం చేసుకుంటారో.. లేక తమ పని తమదే అన్నట్టు వ్యవహరిస్తూ రోడ్డు నిర్మాణంలో జాప్యం ప్రదర్శిస్తారో వేచి చూడాలి.


లీకు అవుతున్న తెలుగుగంగ నీరు

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ఉద్యమాల ద్వారా పోరాటాలు చేయడమే ఏకైక మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి యుటిఎఫ్ భవనంలో జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉద్యమ చైతన్య సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న అనేక సౌకర్యాలు గతంలో ఉద్యమాల ద్వారానే సాధించుకున్నామని, అనేక మంది త్యాగాల ఫలితంగా ఈరోజు మనం ఎన్నో రకాల ఆర్థిక, సర్వీసు పరమైన సౌలభ్యం పొందుతున్నామన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం 12 వ పిఆర్‌సి ప్రకటించినప్పటికీ ఇంతవరకు విధివిధానాలు ఖరారు చేయలేదన్నారు. ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ సంఘాల ఉమ్మడి వేదిక పిలుపు మేరకు ఈనెల 27 న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఉద్యమ చైతన్య సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కోశాధికారి రమేష్ నాయుడు, కార్యదర్శులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్ రెడ్డి, అవనిగడ్డ పద్మజ, సురేష్, శేఖర్, గీతమ్మ పాల్గొన్నారు



'మాతృభాషను పరిరక్షించుకుందాం'

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: మాతృభాష తెలుగును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన అందరి పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్ భాష అన్నారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు మాస్లామని, మోహన్ బెహర, మాధవి, రాజశేఖర్ రెడ్డి, రమణమ్మ, రవి, విష్ణుప్రియ, లక్ష్మి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్: తెలుగు భాషను పరిరక్షించుకోవాలని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాష ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాని జరిగింది. వైస్‌ప్రిన్సిపాల్ వీరయ్య, వెంకటేష్, నర్సింహులు, నాగేశ్వరరావు, రఘురాం పాల్గొన్నారు.



పుత్తూరులో

క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సెట్విన్ తిరుపతి సంయుక్తంగా నిర్వ హించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం బుధవారం సెమినార్ హాల్ హ్యుమానిటీస్ బ్లాక్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా విచ్చేసిన డా. వై సుభాషిణి ఇన్ చార్జ్ శాఖాధ్యక్షులు మాట్లాడుతూ భిన్న ప్రాంతాలలో భిన్న భాషల వారు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటామని, దేశీయ భాషలను సంరక్షించడము, జీవిత కాల అభ్యాసాలను ప్రోత్సహించడానికి తెలుగు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింప చేసేది మాతృ భాష అని తెలిపారు. మాతృభాషలో చదువుకోవాలని వారు కోరారు. అదేవిధంగా శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి నేతృత్వంలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

జర్నలిస్టులపై దాడి హేయం

- కొడాలి నాని వ్యాఖ్యలపై ఆగ్రహం
- రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్
- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎస్వీయూ వద్ద ర్యాలీ

ప్రజాశక్తి-క్యాంపస్: జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య అని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. దాడులను ఖండిస్తూ స్థానికి ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ నుంచి మెయిన్ గేట్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు కొట్టె హేమంత్, ఎన్ఎస్ఐ మల్లి కార్జున, తెలుగు యువత ఆనంద్‌గౌడ్, టీఎస్ఎఫ్ అక్కులప్ప నాయక్, జనసేన విద్యార్థి నాయకులు బాటసారి మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని, అనంతపురం జిల్లా, రాప్తాడులో ఫోటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారి మీద హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని చెప్పారు. దాడులను అరికట్టాల్సిన పాలకులే దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మొన్నటికి మొన్న అమరావతిలో ఇసుక అక్రమ రవాణా పై వార్త రాసినందుకు ఈనాడు రిపోర్టర్ పైన, పుట్టపర్తిలో ఈనాడు ఫోటో గ్రాఫర్ పైన, నిన్న రాప్తాడులో సిద్ధం సభ కవరేజ్‌కు వెళ్ళిన శ్రీకృష్ణ పైన అధికార వైసీపీ నేతలు దాడి చేయడం దుర్మార్గం అన్నారు. దాడి చేసిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి శ్రీకృష్ణ మీద దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కొడాలి నాని జర్నలిస్ట్‌లు గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని లేకుంటే రాబోయే ఎన్నికల్లో కొడాలి నాని మళ్ళీ లారీ క్లీనర్‌గా ప్రజలు పంపిస్తారని ఏదేవా చేశారు.



నేడు బీసీ సంఘాల సమావేశం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని బాలాజీ కాంప్లెక్స్ భవనంలో బీసీ కుల సంఘ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించ తలపెట్టామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పాల్గొంటారని, తిరుపతి జిల్లా అధ్యక్షులు కల్యాణి నాగరాజాగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు బీపి మండల్ విగ్రహం ప్రాంగణం నుండి సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ సభకు నియోజకవర్గాల అధ్యక్షు లు, మండలాల అధ్యక్షులు, కీలక బీసీ నాయకులు, పెద్ద ఎత్తున బీసీలు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-కేవిబిపురం: మండలంలోని బీపీ కండ్రిగ, కోవనూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తహశీల్దార్ శ్రీరాములు నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కావలసిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పకడ్బందీగా పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

'సూపర్వైజర్‌పై చర్యలు తీసుకోండి'

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: మహిళ వర్కర్‌పై దాడి చేసి గాయపరిచిన సూపర్వైజర్ రమణయ్యపై చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రుయా ఆసుపత్రి వద్ద ఆర్.ఎం.ఓ. డాక్టర్ హరికృష్ణను కలిసిన సంఘం నాయకులు మాట్లాడుతూ రుయా ఆసుపత్రిలో ఏ వన్ సర్వీసులో వెంకటలక్ష్మి విధులు నిర్వహిస్తోంది. అదే ఆసుపత్రిలో సూపర్వైజర్‌గా పని చేస్తున్న రమణయ్య మహిళను పెనాయిల్ తీసుకుపోదువు రా అంటూ పిలిచి ఆమెపై దాడి చేసి గాయపరిచారని తెలియజేశారు. దాడికి పాల్పడిన రమణయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, మహిళ సిబ్బంది పాల్గొన్నారు.

లోపాలు లేకుండా రేషన్ పంపిణీ: తహశీల్దార్

ప్రజాశక్తి-కేవిబిపురం: చౌక దుకాణాల్లో ఎండీయూ ఆపరేటర్లు రేషన్ పంపిణీలో లోపాలు లేకుండా చూడాలని తహశీల్దార్ శ్రీరాములు నాయక్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో చౌక దుకాణాల లీడర్ల ఎం.డి.యు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రేషన్ సరుకులు పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

'బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం'

ప్రజాశక్తి-యర్రావారిపాళ్యం: తలకోన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని తలకోన ఆలయ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తలకోనలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించబోయే ఉత్సవాలకు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు కావలసిన ఏర్పాట్లుకు అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి జాగరణ, పార్కింగ్, అలంకరణ, స్వామి వారి నిత్యకైంకర్యాలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కోరారు. పారిశుద్ధ్యం, తాగునీరు, ప్రత్యేక మరుగుదొడ్ల నిర్వహణపై పంచాయతీ నుంచి సహకారం కావాలని పేర్కొన్నారు. అదేవిధంగా పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణకు కావలసిన ఏర్పాట్లుపై పోలీసులతో చర్చించారు. క్యూలైన్లు, ప్రత్యేక ప్రవేశ దర్శనం తదితర అంశాలపై సమావేశంలో ఈవో జయకుమార్ చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాలకిషన్, సర్పంచ్ దేవేంద్ర, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, చెంగల్‌రెడ్డి, హరినాథరెడ్డి, జయంతు, మంజుల, గంగోజమ్మ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గూడూరుటౌన్: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కోట మండలంలోని కేశవరంకు చెందిన పలువురు వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని వారిని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, సర్వోత్తమ్‌రెడ్డి, చెంచురామయ్య, చాన్‌బాషా పాల్గొన్నారు.

'క్రీడాసక్తి పెంపొందించుకోవాలి'

ప్రజాశక్తి-గూడూరుటౌన్: విద్యార్థులు క్రీడాసక్తిని పెంపొందించుకోవాలని ఆదిశంకర పాఠశాల ప్రిన్సిపల్ రూపదేవి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని గోగినేనిపురంలో పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడాపోటీలు నిర్వహించారు. వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

వైభవంగా గంగ జాతర

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండలంలోని అనుపల్లి పంచాయతీ గడ్డ కిందపల్లిలో గంగ జాతర వైభవంగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున గంగమ్మ తల్లి మట్టి ప్రతిమను తయారుచేసి బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండలంలోని సింగనాలతూరు ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవోలు మునిశేఖర్, క్రిష్టయ్యలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

'చరిత్రలో నిలిచేలా అభివృద్ధి'

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: వైసీపీ పాలనలో చరిత్రలో నిలిచేలా అభివృద్ధి సాధ్యమైందని ఆ పార్టీ మండల ఇన్‌ఛార్జ్ కేశవమూర్తిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పుదిపట్లబైలు పంచాయతీలో గడపగడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించి మోహిత్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు.

'ఎన్నికలకు సిద్ధంకండి'

ప్రజాశక్తి-రేణిగుంట: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని తిరుపతి పార్లమెంటరీ యువత అధ్యక్షులు అక్షింతల కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం రేణిగుంటలోని ఓ ఫంక్షన్‌హాల్లో తెలుగు యువతలో సమావేశం నిర్వహించి మాటాడారు. ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, గజేంద్ర, బాలాజీ, కిరణ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

'లోపాల చెప్పాలి.. విమర్శలొద్దు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విమర్శలు మానుకొని వ్యవస్థలోని లోపాలు తెలియజెప్పాలని వైసీపీ నాయకులు అరుణ్‌యాదవ్ ఆనం వెంకటరమణారెడ్డిని సూటిగా ప్రశ్నించారు. తిరుపతి అభివృద్ధిపై నెల్లూరులో ఉండి మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని, తగిన సాయిలో ప్రతిస్పందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, బాబుయాదవ్, నరసింహులు, రాజేశ్వరి, పద్మజ పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుకోని మాట్లాడాలి..

నెల్లూరులో టిడిపి నాయకుడు వెంకటరమణారెడ్డి తనకు టిడిఆర్ బాండ్లు 61.2కోట్లు వచ్చాయని, తన భూమికి సంబంధించి టైటిల్ లేదని టీవీ లైవ్ షోలలో ఆరోపణలు చేశారని, ఆయన వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని తిరుపతి టింబర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కంచి రాము బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్ళూరుపేటలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 40ఏళ్ల వయస్సు కలిగిన మహిళ బుధవారం ఉదయం 7.25 గంటలకు సూళ్ళూరుపేట షార్ ఫ్లేఓవర్ బ్రిడ్జి కింద రైల్వేట్రాక్ దాటుతుండగా ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న జిటి ఎక్స్‌ప్రెస్ రైలు తగిలి మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలి శరీరంపై ఎరుపు చీర ఉన్నట్లు తెలిపారు. ఆమె వద్ద ఉన్న ఆనవాళ్ళ బట్టి పరిసర ప్రాంతాలకు చెందిన మహిళ అయి ఉంటుందని చెప్పారు. మృతదేహాన్ని సూళ్ళూరుపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిసిన వారు 9573245266 నంబరుకు సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సిఎంఎ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇన్స్ టిట్యూట్స్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ కొలకత్తా వారు బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు ఎమరాల్డ్స్ డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. ఈ ఫలితాల్లో ఇంటర్ కోర్సు నందు 58.67 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు పి.భార్గవి 485, ఎ.భాస్కర్ 458, వి.చంద్రమౌళి 440, కె.శశిధర్ 414 మార్కులను సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని ఎమరాల్డ్స్ విద్యా సంస్థల డైరెక్టర్లు అభినందించారు.

గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల గోడపత్రికలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. స్వామీ అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాల గోడపత్రికలను, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

చాముండేశ్వరి ఆలయ ట్రస్టు నూతన కమిటీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని భాస్కరపేటలో ఉన్న చాముండేశ్వరీ దేవి ఆలయ ట్రస్టు నూతన కమిటీని ఈ నెల 19న ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షులుగా చల్లా జయరామయ్య, ఉపాధ్యక్షులుగా సజ్జా చంద్రయ్య, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పులి రవీంద్రబాబు, కోశాధికారిగా గుంటూరు నాగభూషణం నియమితులయ్యారు. గతంలో పనిచేసిన ట్రస్టు ఛైర్మన్ అవినీతికి పాల్పడటంతో ఆయన్ను తొలగించి తిరిగి కొత్త కమిటీని ఎన్నుకున్నామని జయరామయ్య తెలిపారు.

చట్ట విరుద్ధంగా హోటల్ నిర్మాణం

- చర్యలు తీసుకోవాలన్న చింతా మోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్మార్ట్ సిటీ నిధులతో చట్ట విరుద్ధంగా తిరుపతి కపిలతీర్థం వద్ద నిర్మించిన ప్రైవేటు హోటల్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ హోటల్ ముందు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్జీవోలకు సంబంధించిన స్థలంలో తిరుపతి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన స్మార్ట్ సిటీ నిధులు ఉపయోగించి ప్రైవేటు హోటల్‌ను నిర్మించారని, దీని వెనుక భారీ లాబీయింగ్ జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్జీవోల అనుమతి లేకుండా నిర్మించిన హోటల్‌పై చర్యలు తీసుకుంటూ, తక్కువ అద్దెకు ఇవ్వడంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే జర్నలిస్టులను, మీడియా సంస్థలను భయబ్రాంతులకు గురి చేసేలా దాడులు జరుగుతున్నాయని, అధికార మదంతో విర్రవీగుతున్న పార్టీలకు రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు గోపిగౌడ్, రవి, తేజోవతి, శాంతియాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సైన్స్‌డే సంబరాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని రణధీరపురం గ్రామపంచాయతీలో గల రవితేజ ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ స్కూల్‌లో బుధవారం సైన్స్ డే సంబరాలను పాఠశాల డైరెక్టర్ రవి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తిరుపతిఅర్బన్ ఎంఈవో కె.బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను ఇటువంటి చిన్నపాటి ప్రయోగాల ద్వారా వెలికి తీయడానికి చేసే ప్రయత్నాలు భవిష్యత్తులో వారిని ఉన్నత స్థానాల్లో నిలపడానికి వీలవుతుందన్నారు. పిల్లలు తయారుచేసిన పలు ప్రాజెక్టులు చాలా బాగున్నాయని, వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించి ఉపయుక్త పరిశోధనలు చేసేలా తగిన తోడ్పాటు అందించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ రవి చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. అప్స తిరుపతి జిల్లా డెమోక్రటిక్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీధర్, జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, కోశాధికారి కుప్పయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్య భద్రత

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యాన్ని భద్రంగా సంరక్షించుకోవచ్చని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ యం.హేమంత్‌కుమార్ తెలిపారు. వ్యవసాయ విభాగ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జన జీవన పరిస్థితులలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు, ముఖ్యంగా జొన్న, సజ్జ, రాగి చిరు ధాన్యాలు 95శాతం సాగులో ఉండగా కేవలం 5శాతం సాములు, ఆరికలు, కొర్రలు, వరిగలు, ఊదలు మొదలగు చిరు ధాన్యాలు సాగులో ఉన్నాయన్నారు. కార్యక్రమానికి ఉపకులపతి ప్రొఫెసర్ నాగరాజరామారావు అధ్యక్షత వహించారు, కె.సారధి, రిజిస్ట్రారు, ప్రొ.ఎన్.ఈశ్వర్, ఎ.శ్రీనివాసులు, డా.గిరిధర క్రిష్ణ, డా.సాంబశివరావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు బాధాకరం: సర్పంచ్ వీరమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శెట్టిపల్లిగా ఏర్పడిన పంచాయితీలో తిరుపతి నగరపాలక సంస్థలు విలీనం కాబడి చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పడిన న్యూ మంగళం పంచాయతీకి సంబంధించిన వార్డులలో నిధులు వెచ్చించి సీసీ రోడ్లు వేస్తున్నామని, దీనిపై అబద్ధపు ప్రచారాలు జరగడం సోచనీయమని సర్పంచ్ వీరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. సప్తగిరి లే అవుట్‌లో నివాసముండే ప్రజలు పలుమార్లు గ్రామ సభలో అర్జీలు ఇవ్వగా గ్రామసభ ఆమోదం మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

చదువుతోనే ఉన్నత స్థానం

ప్రజాశక్తి-బాలాయపల్లి: చదువు సమాజంలో ఉన్నత స్థానం కల్పిస్తుందని వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌గోపాల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంగమాంబ పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతి పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం: హరి

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువేయడంలో వలంటీర్ల సేవ లు అభినందనీయం అని మున్సిపల్ ఛైర్మన్ హరి, కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి పేర్కొ న్నారు. బుధవారం ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను వారు ఘనంగ సన్మానించారు.

గూడూరుటౌన్: వలంటరీ వ్యవస్థ ప్రభుత్వానికి ప్రజలకి వారధిగా పనిచేస్తోందని ఎమ్మెల్సీ మేరుగ మురళి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ కళ్యాణమండపంలో 323మంది వలంటీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవసేనమ్మ, శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, వీరారెడ్డి, నాగులు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళ్యం: వలంటీర్లు జగనన్న సైన్యం అని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో వలంటీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మిద్దెల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా మిద్దెల హరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ బస్సు భవన్ కేంద్ర కార్యాలయం విజయవాడలో ఆర్టీసీ ఛైర్మన్, ఎండీ, బోర్డు సభ్యుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా బోర్డు సమావేశంలో పాల్గొన్నారు. మిద్దెల హరిని ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, బోర్డుసభ్యులు, డైరెక్టర్లు సన్మానించి అభినందించారు. బోర్డు సమావేశంలో పాల్గొన్న మిద్దెల హరి ఆర్టీసీ అభివృద్ధిపై మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రముఖ పుణ్యక్షేత్రం అయినందున ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధ్యాత్మిక రూపంలో మార్పు చేయుటకు కావాల్సిన నిధులు కోరారు. అదేవిధంగా శ్రీకాళహస్తికి మరికొన్ని బస్సులు కావాలన్నారు. తిరుపతిలో రెండవ బస్టాండ్ నిర్మించుటకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. ఇందుకు ఆర్టీసీ ఛైర్మన్, ఎండి సానుకూలంగా స్పందించారు. ఆర్టీసీ సంస్థలో ఉద్యోగుల కొరత ఉండటం వలన కొత్త సిబ్బందిని నియమించాలని సమావేశంలో కోరగా అందుకు కూడా వారు స్పందించారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, 12, 13 మార్చి, 2024న "సదర్వా 2024"ని నిర్వహిస్తోంది. ఈవెంట్ యొక్క టీజర్‌ను ప్రొఫెసర్ పి.మల్లికార్జున, డైరెక్టర్, ప్రొఫెసర్ పి.సత్యనారాయణ విడుదల చేశారు. సదర్వా అనేది వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల కోసం నిర్వహించబడే జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ పోటీలు. ఈ సాంకేతిక ఉత్సవం పేపర్ ప్రెజెంటేషన్లు, పోస్టర్ ప్రెజెంటేషన్లు, క్విజార్డ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ గేమ్‌లను నిర్వహిస్తుంది. టీజర్ విడుదల కార్యక్రమంలో లక్ష్మీప్రశాంతి, విష్ణుప్రియ, అమృత, రాజేశ్వరి పాల్గొన్నారు.

కళాశాల అదనపు గదులకు భూమిపూజ



ప్రజాశక్తి,చిన్నగొట్టిగల్లు: తన తండ్రి వలసారెడ్డి సిద్ధరామిరెడ్డి జ్ఞాపకార్థం చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు గదులు నిర్మాణానికి దాత శివప్రసాద్‌రెడ్డి రూ.2కోట్ల సొంత నిధులు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చారు. కాగా బుధవారం గదుల నిర్మాణానికి సంబంధించి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. తుడా ఛైర్మన్ మోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గొప్ప సంకల్పంతో కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం సంతోషించాల్సిన విషయం అన్నారు. ఈ సందర్భ ంగా శివప్రసాద్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో దాత శివప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి, జడ్పిటిసి స్వరూప, నాయకులు మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, ఖదీర్ అహమ్మద్, భాస్కర్ రెడ్డి, సర్పంచ్ మనో హర్, అక్బర్ ఖాన్, బావాజీ, కళాశాల ప్రిన్సిపాల్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీని ఆదరించండి'

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించి గెలిపించాలని టీడీపీ సత్యవేడు ఇన్‌ఛార్జ్ హెలెన్ హేమలత అన్నారు. బుధవారం మండలంలోని పల్లమల పంచాయతీలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం ద్వారా ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సుధాకర్‌నాయుడు, కన్నయ్యనాయుడు, వీరరాఘవులు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వెంకటాచలం, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ కార్యశాల

ప్రజాశక్తి-క్యాంపస్: మ్యాథమెటికల్ టెక్నిక్స్, కంప్యూటేషనల్ టూల్స్‌లో హ్యాండ్స్-ఆన్ ఎక్స్‌పీరియన్స్ అనే అంశంపై జరుగుతున్న జాతీయ కార్యశాల సమాపనోత్సవం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతిలోని గణిత విభాగం ద్వారా మ్యాథమెటికల్ టెక్నిక్స్, కంప్యూటేషనల్ టూల్స్‌లో హ్యాండ్స్-ఆన్ ఎక్స్‌పీరియన్స్ అనే అంశం పై జరుగుతున్న జాతీయ కార్యశాల బుధవారం రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో ముగిసింది.

వర్సిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా: అభినయ్



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు అన్ని విధాల కృషి చేస్తానని వైసీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. బుధవారం వర్సిటీలో సిబ్బందితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలాంటి అప్‌డేటెడ్ నాయకులే ప్రస్తుత రాజకీయాలకు అవసరం, గత రాజకీయ నాయకులందరూ తమ స్వలాభాల కోసం తిరుపతి అభివృద్ధిని గాలికి వదిలేశారని చెప్పారు. సమావేశంలో 23వ వార్డు కౌన్సిలర్ రామస్వామి వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జ్ రఘురామరెడ్డి, శంకర్, భరత్‌రెడ్డి, గౌరీ, లోకేష్, గౌతమి, మఠం గిరి, నాగరాజు, వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పట్టించుకోండి: సర్పంచ్

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఎస్‌బీఆర్ పురం గ్రామ సమస్యలను పట్టించుకొని వాటిని పరిష్కరించాలని సర్పంచ్ మణిరాజు అధికారులను కోరారు. వడమాలపేట మండల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీలో అభివృద్ధి పనులు సాగడం లేదని, పలుమార్లు అర్జీలు సమర్పించినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ గెడ్డం సుబ్రమణ్యం యాదవ్, సుకుమార్‌రాజు, సూరి, శంకర్, యాయతి, సుదర్శనరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.